
# పసి(డి)మనసు

జొన్నలగడ్డ రామల



"ఓసేవ్, పద్మా! ఎక్కడ చచ్చావ్? ఒకసారి ఇలా వచ్చి తగలడు."

చిన్నతమ్ముడికి తల దువ్వుతున్న పద్మ ఆ పిలుపు విని కంగారుపడి దువ్వెన అక్కడే పారేసి-వంటింట్లోకి పరుగెత్తింది.

పద్మను చూస్తూ తల్లి అంది. "వచ్చావా తల్లీ-ఇందాకట్నుంచీ అరుస్తూంటే ఇప్పటికైనా తీరుబడి అయింది కదా-కాస్త బియ్యం ఏరి పెట్టి-కడిగి ఎసట్లో పోయగలవా?"

"అలాగే నమ్మా! చిన్నతమ్ముడు మారాం చేస్తూంటే తల దువ్వుతున్నాను. వాడి గొడవలో నువ్వు పిలవడం వినిపించలేదు."

"నిన్నిప్పు డెవ్వరూ సంజాయిషీ అడగ లేదు కానీ-కాస్త చెప్పిన పని చేసిపెట్టు."

పద్మ మాట్లాడకుండా కూర్చుని బియ్యంలో బెడ్డలు ఏరసాగింది.

పద్మ వయసు ఎనిమిదేళ్ళు. ఆమె తల్లి వనజ చాలా బద్ధకస్తురాలు. ఆవిడ బద్ధకానికి తగట్టుగానే అయిదుగురు పిల్లలూ, ప్రస్తుతం మళ్ళీ కడుపేమోనని అనుమానంకూడా ఉంది. పద్మ తండ్రి సుబ్రహ్మణ్యం ఇంటి వ్యవహారా లట్టే పట్టించుకోడు. పనిచెయ్యాలంటే అతనికి బద్ధకమే. పైగా ముక్కుమీదకోపం, కానయితే మనిషి చాలా మంచివాడు.

వనజకు ఒక్క నోటితో తప్ప మరి దేంతోనూ పనిచేయడంలో నేర్పు లేదు. ఉన్న ఆ ఒక్క నేర్పునూ మాత్రం ఆవిడ సవ్యంగానే ఉపయోగించుకుంటోంది. ఆ కారణంగానే ఇంట్లో పనంతా పిల్లలే చేసుకోవలసి వచ్చేది.

ఈ విషయంలో వనజ చాలా అదృష్టవంతురాలనే చెప్పాలి. ఆమెకు లేని నేర్పూ, ఓర్పూ ఆమె పిల్లలకుంది. ఆమెకున్న వాక్శక్తి వాళ్ళకు లేదు. దాంతో వాళ్ళు కిమ్మనకుండా ఇంటి పనులన్నీ చేసుకుపోయేవారు. అందరిలోకీ పెద్దదైన పద్మమీద ఈ బాధ్యతంతా పడింది.

ముక్కుమీద కోపం ఉన్న సుబ్రహ్మణ్యానికీ, నోరుదుకోని వనజకూ తగవులు రావడంలో అసహజమేమీ లేదు. ఆ కారణంగా

వాళ్ళిద్దరూ రోజుకొక్కసారైనా పోట్లాడుకునే వారు. దొడ్లో మామిడి మొక్క తాలూకు ఒక చిన్న ఆకును మేక తినేసిందనే విషయానికి-ఇల్లెగిరిపోయేలా సుబ్రహ్మణ్యం కేకలు వేస్తే ఊరదిరిపోయేలా వనజ జవాబు చెప్పేది. ఫలితంగా పిల్లలు-బిక్కు-బిక్కుమంటూ ఓ మూల కూర్చునేవారు. తల్లీ తండ్రీ ఆప్యాయంగా పలకరించుకున్న రోజున ఇంట్లో పిల్లలకి ఒక పండుగలా వుండేది.

అందుకే పిల్లలెప్పుడూ—నాన్నగారైనా, అమ్మయినా ఊరికెడితే బాగుండును అనుకునే వారు.

ఎప్పుడేనా వాళ్ళవాళ్ళకి జబ్బుగాఉండి వనజ పుట్టింటికి వెళ్ళేది-చంటిపిల్లాడినీ-పెద్దపిల్లాడినీ తీసుకుని. అప్పుడు పద్మ తండ్రికి వండిపెట్టేది-తమ్ముళ్ళిద్దరి సాయంతో.

తల్లి దగ్గర లేదుగదా అని సుబ్రహ్మణ్యం కూడా పిల్లల్ని ఎంతో ప్రేమగా పలకరించి యోగక్షేమాలడుగుతూ సరదాగా కాలం గడిపేవాడు. గుండెలదిరిపోయేలా వుండే పోట్లాటలు లేకపోవడంవల్ల పిల్లల ప్రాణాలకు హాయిగా ఉండేది. అలాగే ఏదైనా పనిమీద సుబ్రహ్మణ్యం ఊరెళ్ళినా వాళ్ళకి బాగానేవుండేది.

లేతమనసులు సినిమా చూసినప్పుడు—ఆ సినిమాలో పిల్లలు-తల్లీతండ్రీ కలసివుండాలని అంతగా ఎందుకు తపించిపోయారో పద్మకు అర్థంకాలేదు. అలాగే మరికొన్ని సినిమాల్లో-సవతితల్లి-పిల్లల్ని బాధపెట్టడమూ - అందరూ ఆమెను దూషించడమూ జరిగినప్పుడు-కన్నతల్లయినా అంతేగా-అనుకునేది పద్మ!

ఆమె అలా అనుకోవడంలో అర్థం లేకపోలేదు. ఆమె తల్లిప్రేమను పూర్తిగా రుచి చూడలేదు. తల్లి ఆప్యాయంగా పలకరించిన సంఘటనలు ఆమె జీవితంలో చాలా తక్కువ. ఎప్పుడూ చీవాట్లూ, శాపనార్థాలనే రుచి చూస్తున్న ఆమె ఆప్యాయతతోకూడిన పిలుపు కోసం తహతహలాడిపోతోంది.

పద్మ ఉదయమే లేచి మొహం కడుక్కొని తమ్ముళ్ళచేత మొహం కడిగిస్తుంది. పని మనిషికి అంట్లు వేస్తుంది. కడిగిన గిన్నెలు ఇంట్లో పెడుతుంది. తమ్ముళ్ళకి నీళ్ళోసి తను పోసుకుంటుంది. తండ్రికి షేవింగుకి కావలసిన ఏర్పాట్లు మొదలైనవి చేస్తుంది. ఆఖరి తమ్ముడికి తల్లి నీళ్ళు పోసేటప్పుడు-తను పై నీళ్ళు పోస్తుంది. వంటలో తల్లికి పైపనులు సాయం చేస్తుంది. ఈ పనులన్నింటినీ ఆమె తమ్ముళ్ళ సాయంతో చాకచక్యంగా ముగించుకుని-బడికెళ్ళిపోతుంది—తండ్రితో కలసి. మళ్ళీ సాయంత్రం వచ్చి చేయవలసినంతా, చేయగలిగినంతా తల్లికి సాయం చేస్తుంది. రాత్రి చదువుకుని పడుకుంటుంది.

చుట్టుపక్కలంతా పద్మను మెచ్చుకుంటూండేవారు. ఆ మెప్పుదల ఆమె కానందాన్ని కలిగించినప్పటికీ-తల్లి తన్ను మెచ్చుకోలేదన్న బాధ ఆమెని వదిలేదికాదు.

తలిదండ్రులామెను ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తున్నారనీ వాళ్ళ తీరే అంత అనీ ఆమెకు తెలియదు. అలా తెలిసే అవకాశం తలిదండ్రులు ఇవ్వలేదు

ఏది ఏమయినా తలిదండ్రుల మీద పద్మకు అసహ్యంలేదు. తల్లికీ, తండ్రికీ ఏమాత్రం బాధ కలిగినా ఆమె గిలగిల్లాడిపోయేది. వాళ్ళు తనని ఆప్యాయంగా పలకరించలేదే అన్న బాధ తప్ప-ఆమెకు వాళ్ళమీద మరో విధమైన కోపంలేదు.

తమ్ముళ్ళకు ఒకటి రెండుసార్లు జ్వరం వచ్చినప్పుడు తల్లి ఎంత గిలగిల్లాడిపోయిందో-తండ్రి ఎంత కంగారుపడ్డాడో ఆమెకు తెలుసు. కానయితే అప్పుడూ ఆమెకు చీవాట్లే ఎదురయ్యేవి. అస్తమానూ తల్లి తమ్ముడిదగ్గరే కూర్చుని-బార్లీ నీళ్ళు కలపమనీ, హార్లిక్సు కలపమనీ పనులు పురమాయించేది. పద్మ అన్ని పనులూ చేయలేక అలసిపోయి-"ఒక్క నిముషమాగి చేస్తానమ్మా!"అంటే వనజ బాగా కసురుకునేది.

అప్పుడు పద్మకు అనిపించేది, "అమ్మకు నేనంటేనే ఇష్టంలేదు. తమ్ముళ్ళంటే ఇష్టమే!" అని.

## (వి) చిత్ర విజ్ఞానం



మనంవాడే ఆఫ్టర్ షేవ్ లోషన్లలోని, (ట్రైబ్రోమో సేలిసి లాని లైడ్ (TBS) అన బడే క్రిమిసంహారక పదార్థం చర్మానికి హాని కరమట! దీనివల్ల **"Photo allergy"** అంటే సూర్యరశ్మికి ఎలర్జీ) వస్తుందట, ఈ లోషన్లను విరివిగా వాడితే ముఖం మీద మచ్చలు, దురదపుట్టించే వ్యాధులు వస్తాయని **"THE WALL STREET JOURNAL"** లో పేర్కొనబడి వుంది!

---

అప్పుడే ఆమెకు మరో ఆలోచనకలిగింది. 'నాక్కూడా జ్వరమొస్తే అమ్మ నన్నూ ప్రేమగా పలకరిస్తుందేమో!" అని. ఆవిషయం తెలుసుకోవడం కోసం తనకు జ్వరమొస్తే బాగుండునని దేవుడికి మొక్కుకుంటూ వుండే దామె.

ఎనిమిదేళ్ళలో ఎన్నడూ జ్వరమనేది ఎరుగని పద్మకు-భగవంతుని వరప్రసాదమా అన్నట్లు జ్వరం వచ్చింది. రావడంలోనూ ముమ్మరంగా, ఒళ్ళు తెలియనంతగా వచ్చేసింది.

మొదట్లో వనజకు కూడా తెలియలేదు.

ఆరోజు ఆదివారం!

భోజనాలయేక అంతా పడుకున్నారు. పద్మ కూడా పడుకుంది. మిగతా పిల్లలు ఆడుకుంటున్నారు. టైము రెండున్నరయినప్పుడు "పద్మా! కాస్త లేచి కుంపటంటించమ్మా! మీ నాన్నగారికి కాఫీ టయిమవుతోంది!" అంది వనజ మత్తుగా ఆవలిస్తూ.

ఆవిడకు సమాధానం రాలేదు.

"ఒసేవ్-నిన్నేనే!" అంటూ రెట్టించింది వనజ.

అయినా సమాధానం రాలేదు.

"నా సత్తువంతా వీళ్ళను లేపేసరికే అయిపోతోంది. ఇంత మొద్దునిద్దరేమిటి బాబూ!" అని ఆవిడ విసుక్కుని ఆవులించుకుంటూ పద్మను లేపాలని ఒంటిమీద చేయి వేసి ఉలిక్కిపడింది.

పద్మ ఒళ్ళు కాలిపోతోంది.

ఆవిడ కంగారుపడి పద్మా, పద్మా అంటూ ఒకటి రెండుసార్లు పిలిచింది. పద్మ ఉలక లేదు పలకలేదు. దాంతో కంగారుగా భర్త దగ్గరకు పరుగెట్టింది.

"ఏమిటే-ఏ సౌద-కాఫీ ఇంకో పావుగంట పోయి తరువాత తాగుతాలే!" అంటూ మరో పక్కకు చిరాగ్గా ఒత్తిగిల్లాడు సుబ్రహ్మణ్యం.


"అబ్బ. ఎప్పుడూ మాయదారి కాఫీయే మీకు. అవతల పిల్లదాని ఒళ్ళు కాలిపోతూంటేనూ" అంది వనజ.

సుబ్రహ్మణ్యం మత్తు వదిలిపోయింది. "ఏమిటీ?" అన్నాడు ఉలిక్కిపడి.

"పద్మ మూసిన కన్నెరక్కుండా పడుకుండండీ-ఒళ్ళు చూస్తే కాలిపోతోంది-పిలిస్తే పలకడంలేదు, నాకేదో భయంగా ఉంది."

సుబ్రహ్మణ్యం వెంటనే లేచి పద్మదగ్గరకు వచ్చాడు. ఓసారి పిలిచాడు. పద్మ మాట్లాడ లేదు. ఓసారి నుదుటిమీద చెయ్యివేసిచూశాడు. వెంటనే చొక్కావేసుకుని, "డాక్టరుని తీసుకొస్తాను!" ముక్తసరిగా అని బయల్దేరాడు.

డాక్టరు వచ్చి పద్మను పరీక్షించాడు. "జ్వరం రావడమే చాలా తీవ్రంగా వచ్చింది. టైఫాయిడేమోనని అనుమానంగా ఉంది. మీరేం కంగారు పడకండి!" అంటూ ఆయన కొన్ని



## కథక చక్రవర్తి శ్రీపాద చిన్న కథలపై పరిశోధనకు 'కనక్ ప్రవాసి'కి డాక్టరేట్ డిగ్రీ

"కథక చక్రవర్తి స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష' అనే పరిశోధన వ్యాసానికి శ్రీ బామర్తి కనకయ్యకు ఆంధ్రవిశ్వవిద్యాలయం "డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ" (పి. హెచ్. డి) డిగ్రీ ప్రకటించింది. శ్రీ కనకయ్య. "కనక్ ప్రవాసి అనే కలం పేరుతో తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితులు. వీరు కాకినాడ పి. ఆర్ ప్రభుత్వ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

కనక్ ప్రవాసి ఇదివరలో అద్దానికి అటూ ఇటూ; ఒప్పందం; పతివ్రత మొదలయిన కథా సంపుటాలను ప్రకటించడమేగాక గత ముప్పై సంవత్సరాలలో వివిధ పత్రికలలో కథలూ, వ్యాసాలూ 500 కి పైగా ప్రకటించారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు వ్రాసిన 75 చిన్న కథలపై శ్రీ కనకయ్య రచించిన పరిశోధన వ్యాసం (478 పేజీలు) ఒక సుప్రసిద్ధ కథారచయిత కథలపై తెలుగులో వచ్చిన మొట్టమొదటి సిద్ధాంత వ్యాసం. ఇది వ్యావహారిక భాషలో వ్రాయబడడం ఒక విశేషం.

మందులు ఇచ్చి, పద్మకు ఓ ఇంజక్షనిచ్చి వెళ్ళిపోయాడు.

పద్మకు ఆ రాత్రి ఎనిమిదయేదాకా మెలకువ రాలేదు. అంతవరకూ వనజా, సుబ్రహ్మణ్యం ఇద్దరూకూడా స్థిమితంగా లేరు పిల్లలకోసమని ఏదో వంటచేశాననిపించింది వనజ శాస్త్రానికన్నట్లుగా ఎంగిలిపడ్డారు ఇద్దరూ

రాత్రి ఎనిమిది గంటలకు పద్మ కళ్ళు తెరిచిన సమయానికి తల్లీ, తండ్రీ ఇద్దరూ ఆమెవంకే ఆత్రుతగా చూస్తున్నారు తల్లి చేయి ఆమె నుదుటిమీద ఉంది

'ఎలా ఉందమ్మా? ఇద్దరూ ఒక్కసారే ప్రశ్నించారు,

బాగానే ఉంది-అసలు నాకేమయిందమ్మా! అనడిగింది పద్మ

"మరేం లేదమ్మా! నీకు జ్వరమొచ్చింది మధ్యాహ్నంనుంచి ఇంతవరకూ నువ్వు అసలు మాటాడలేదు—మాకేసి చూడలేదు నువ్వు మాటాడతావని ఇంతవరకూ చూసి చూసి ఇప్పుడే పడుకున్నారమ్మా—తమ్ముళ్ళు! మరి ఇప్పుడు నీకెలా ఉందమ్మా!'' అంది వనజ మాటాడుతూంటె ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి


'బాగానే ఉందమ్మా-కానీ కొంచెం నీరసంగా ఉంది!

'అయితే కొంచెం బార్లీ నీళ్ళు పెడతాను తాగుదువు గాని! అని- ఏమండీ కొంచెం దగ్గరుండి ఆ కబురూ ఈ కబురూ చెప్పండీ-నేనిప్పుడే బార్లీ కలుపుకొస్తాను అంటూ వనజ వంటింట్లోకి పరుగెత్తింది

తనకు జ్వరమొచ్చిందని తెలియగానే పద్మకు సంతోషం కలిగింది దాంతో ఆమె జ్వరంవల్ల కలిగిన బాధనుకూడా మరిచిపోయి—భగవంతుడికి నమస్కరించుకుంది—

"ఏదయినా బాధగా వుందామ్మా!" సుబ్రహ్మణ్యం అడిగాడు.

"లేదు నాన్నా! తేలిగ్గానే వుంది!" అంది పద్మ. సుబ్రహ్మణ్యం బాధగా నిట్టూర్చాడు.




మీరా.

పద్మకు రెండు రోజులవరకు టెంపరేచర్ తగ్గలేదు. ఆ తర్వాత కొంచెం కొంచెంగా తగ్గి నాలుగు రోజులలో నార్మల్‌కు వచ్చింది. ఆ రోజున డాక్టర్ చెప్పాడు "ఈ పాపకు చాలా విశ్రాంతి అవసరం. జ్వరం టైఫాయిడ్‌లోకి దింపుతుందేమోనని కంగారు పడ్డాను కానీ దేవుడి దయవల్ల అలా జరగలేదు. అయితే పత్యానికి మాత్రం ఒకటి రెండు రోజులు చూద్దాం—"

ఈ మాటలు పద్మ వింది. జ్వరం తగ్గిపోయిందన్న మాట ఆమెను కలవరపరచింది.

నిజంగా ఈ ఆరు రోజుల్లోనూ పద్మ బాగా సుఖపడిందని చెప్పవచ్చు. ఆ సుఖం ఆమె శరీరానికి కలిగింది కాదు. ఆమె మనస్సుకు. తల్లీ, తండ్రీ తన్నెంతగా అభిమానిస్తున్నారనీ, తన కోసం ప్రాణాలయినా అర్పించడానికి సిద్ధంగా వున్నారనీ—చీవాట్లు తప్ప వినిపించని అమ్మ నోటినుండి ఆదరణతో కూడిన మాటలు వినిపించడంతో పద్మ మనస్సు ఆహ్లాదంతో నిండిపోయింది. అమ్మ ఎప్పుడూ ఇలాగుంటే ఎంత బాగుండును? అనికూడా ఆమె అనుకుంది. అయితే అదంత సులువా? మళ్ళీ తన జ్వరం తగ్గగానే అమ్మ మళ్ళీ మామూలుగా అయిపోతుంది.

తల్లిప్రేమను అంతవరకూ సరిగా ఎవి చూడని పద్మకు—ఇంకా తనివి తీరలేదు. తల్లిలాలింపులో — ఆమెకు అదో రకమైన ఆనందానుభూతి కలుగుతోంది. ఈ ఆరు రోజుల్లోనూ తను పొందిన ఆనందం మరికొంత కాలం కొనసాగితే ఎంతో బాగుంటుందని ఆమెకు అనిపించింది. అంతేకాదు ఈ ఆరు రోజుల్లోనూ వనజా, సుబ్రహ్మణ్యం—పద్మకు వినిపించేలా ఒక్కసారిగూడా పోట్లాడుకోలేదు సరిగదా—ఎంతో సభ్యతను ప్రదర్శించేరు. ఈ మార్పుకూడా పద్మకు వాంఛనీయమే కావడంతో—జ్వరం తగ్గిపోయిందే అన్న బాధ పద్మను పీడించసాగింది.

చాలాసేపు ఆలోచించి పద్మ ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది. తన జ్వరం తగ్గిపోవడానికి వీల్లేదు — అందుకోసం తను ఏమైనా చేయాలి—ఏమైనా చేయాలి!

ఆ సాయంత్రమే హఠాత్తుగా పద్మకు టెంపరేచర్ పెరిగిందని కంగారుగా సుబ్రహ్మణ్యం డాక్టరుకోసం పరుగెత్తాడు. వనజ కంగారుగా- "ఇంతలోనే ఎలా వచ్చిందే బాబూ" అంటూ కళ్ళనీళ్ళతో పద్మ పక్కనే కూర్చుంది.

"ఎందుకమ్మా—అలా ఏడుస్తావు?" అంది పద్మ.

"ఏం లేదమ్మా' నీ జ్వరం తగ్గిపోయింది కదా అని పొద్దున్నే దేవుడికి కొబ్బరికాయ కూడా కొట్టాను — కానీ మళ్ళీ నీకు జ్వరమొచ్చింది — పాపం నాన్నగారు కంగారుగా డాక్టరుకోసం వెళ్ళారు!"

డాక్టరు వచ్చాడు. ఆమె నాడి చూశాడు. అనుభవంతో కూడిన ఆయన కళ్ళు అనుమానాస్పదంగా అందరివంకా చూశాయి. "పాపకు ఏమయినా పెట్టారా మధ్యాహ్నం?" అనడిగాడాయన.

"ఒక్క బార్లీ తప్ప ఏమీ ఇవ్వలేదు డాక్టర్!" అంది వనజ.

"నిజం చెప్పండి — మీ పాప ఆరోగ్యం

కోసమే. అడుగుతున్నాను." అన్నాడాయన గంభీరంగా—"ఒకవేళ పాప గట్టిగా మారాం చేస్తే పరవాలేదులే అని కొంచెం అన్నం పెట్టి వుంటే—చెప్పండి — పరవాలేదు — అలా పెట్టడంవల్ల మంచే కానీ, చెడు లేదు—"

"నిజంగా పెట్టలేదండీ—పాప—అది ఏ మారామూ చేయలేదుకూడా!" అంది వనజ.

"అయితే అంతా ఒకసారి బైటకు వెళ్ళండి!" అన్నాడాయన. అంతా వెళ్ళి పోయాక ఆయన పద్మ తల నిమురుతూ— "నువ్వు ఎవరూ చూడకుండా కొంచెం అన్నం తిన్నావుకదూ?" అన్నాడు.

"అవునండీ!" అనేసింది పద్మ చటుక్కున.

వెంటనే ఆయన తీక్షణంగా పద్మవంక చూశాడు. "ఎందుకు తిన్నావ్?"

పద్మ వణికిపోయింది. ఒక్క నిముషం ఆమెకు నోట మాటరాలేదు.

"ఎందుకు తిన్నావ్?" ఆయన మళ్ళీ గర్జించాడు.

"అది కాదండీ—అస్తమాన్లూ మా అమ్మ నన్ను తిడుతూ వుంటుంది. ఎంత పనిచేసినా మెచ్చుకోదు. ఈ జ్వరమొచ్చినప్పట్నించీ మా అమ్మ చాలా అభిమానంగా చూస్తోంది. ఎప్పుడూ మాట్లాడనంత ప్రేమగా మాట్లాడుతోంది. మరి జ్వరం తగ్గిపోతే అలా మాటలాడదు. నాకేమో మా అమ్మెప్పుడూ అలాగే మాటలాడాలని వుంటుంది. అందుకోసమని జ్వరం తగ్గిపోకుండా వుండాలని ఎవరూ చూడకుండా కొంచెమే అన్నం తిన్నాను. నాకు జ్వరమొస్తే మా అమ్మా, నాన్నగారుకూడా దెబ్బలాడుకోవడం మానేశారు. లేకపోతే ఎప్పుడూ దెబ్బలాడుకోవడమే!" అంటూ ఏడుస్తూ చెప్పింది పద్మ.

డాక్టరు అంతా మౌనంగా విన్నాడు. ఆయన కళ్ళలో నీళ్ళు నిలిచాయి

సుబ్రహ్మణ్యం ఇంట్లోని భాగోతం గురించి ఆ వీధిలోని అందరకూ తెలుసు. డాక్టరుకూడా ఆ వీధిలోనివాడే. ఆయనకు పద్మ పసిమనసులోని తపన అర్థమయింది. తల్లి ప్రేమకోసం-శారీరకమైన బాధను ఎంతైనా సహించడానికి నిశ్చయించుకున్న పద్మ మానసిక సంఘర్షణ పరిమాణం ఆయనకు తెలిసివచ్చింది.

వనజ, సుబ్రహ్మణ్యం పద్మ గదిలోకి వచ్చారు. గది బయటనే వున్న వాళ్ళకీమాటలు వినిపించాయి. కళ్ళలో నీళ్ళతో పద్మ వంక చూస్తున్న వాళ్ళవంక డాక్టర్ అదోకలా చూసి అన్నాడు.

"తల్లి ప్రేమలో పొందే అనుభూతి మరెందులోనూ పొందలేమంటారు. కన్న బిడ్డలను రోజుకొకసారైనా తలిదండ్రులు ఆప్యాయంగా పలకరించకపోతే వారి పసి మనసులు గాయపడతాయి. మీ అమ్మాయి మీ అభిమానంకోసం తహతహలాడిపోతోంది. సరయిన మందు మీరే ఇవ్వాలి. మీ మందు పనిచేశాకనే నా మందు పనిచేస్తుంది. రెండు రోజులు అమ్మాయిని జాగ్రత్తగా చూసుకుంటే చాలు—పెద్ద ప్రమాదమేం లేదు!"

రెండు బిళ్ళలిచ్చి, ఒక టానిక్ సీసా తెమ్మని రాసిచ్చి ఆయన వెళ్ళిపోయాడు.

వనజ, సుబ్రహ్మణ్యం ఇద్దరూ కుమార్తె వంక చూశారు. తమవంకే కన్నార్పకుండా చూస్తున్న అమాయకమైన పద్మను చూడగానే ఇద్దరి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి—

"పాపిష్టిదాన్ని — కన్న కూతుర్ని ఎంత హింసపెట్టాను!" అని బాధపడింది వనజ. ఆ బాధలోనే ఆమె నిశ్చయం చేసుకుంది—ఆ నిశ్చయం చెబుదామని భర్తకేసి తిరగబోయే సరికి సుబ్రహ్మణ్యమే నెమ్మదిగా అన్నాడు.

"మన మింకెప్పుడూ పోట్లాడుకోకూడదే-కనీసం పిల్లల ముందయినా మానేద్దాం!"

సమాధానంగా వనజ అంది — "పిల్లలూ, దేవుడూ ఒకలాంటి వారే నంటారు — పిల్లల ముందేకాదు—సర్వవ్యాప్తి అయిన దేవుడి ముందు మాత్రం మనమెందుకు దెబ్బలాడుకోవాలి"

అలా అంటుండగానే ఆమె హృదయం భర్తపట్ల, పిల్లలపట్ల వాత్సల్యంతో నిండి పోయింది. □